ప్రజాశక్తి
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





## 'కూటమి' నేతల

# దౌర్జన్యకాండ



అనిల్‌కుమార్‌పై(సర్కిల్‌లోని వ్యక్తి) దాడి చేస్తున్న టిడిపి నేతలు

- 'ఎమ్మెల్సీ' ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద రౌడీయిజం
- పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు పోలింగ్ ఏజెంట్లు, మద్దతుదారులపై దాడులు
- మహిళా అధికారులకూ బెదిరింపులు
- పలు పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లు వేసిన అధికారపార్టీ నేతలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, భట్టిప్రోలు

**ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యుని ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో అధికార 'కూటమి' నేతలు రౌడీల్లా వ్యవహరించారు. ప్రశాంతంగా ఉండాల్సిన పోలింగ్ కేంద్రాల వద్ద దౌర్జన్యకాండ సృష్టించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పోలింగ్ ఏజెంట్లు, ఆయన మద్దతుదారులపై దాడులకు తెగబడ్డారు. పలు పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లూ వేశారు. కొన్ని చోట్ల అడ్డుకున్న అధికారులపై బెదిరింపులకు పాల్పడ్డారు. మహిళా అధికారులతో కూడా నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఎలా పనిచేస్తారో చూస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. మంత్రి పేరు చెప్పి.. నానా హంగామా సృష్టించారు.**



నిజాంపట్నంలో పోలింగ్ కేంద్రం వద్ద ఆర్‌ఐను బెదిరిస్తున్న అధికార పార్టీ నాయకులు

బాపట్ల జిల్లాలో పలు చోట్ల అధికారం అండగా కూటమి అభ్యర్థి మద్దతుదారులు యథేచ్ఛగా దొంగ ఓట్లు వేయించారు. ఎలాంటి గుర్తింపుకార్డులు లేకుండా ఓట్లు వేయించేందుకు పోలింగ్ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. పోలింగ్ చివరి గంటలో జిరాక్స్ గుర్తింపు పత్రాలతో దొంగ ఓట్లు వేయించారు. బాపట్ల పట్టణంలోని రెండు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి కూటమి అభ్యర్థి మద్దతుదారులు మోహరించారు. పోలింగ్ కేంద్రాల గేట్ల వద్దనే గుంపుగా చేరారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోలింగ్ కేంద్రంలోని బూత్‌ల వద్దనే మీడియా సమావేశం పెట్టారు. గుంపులుగా కూటమి అభ్యర్థి మద్దతుదారులు బూత్‌ల వద్ద తిరుగుతున్నా పోలీసులు పట్టించుకున్న పరిస్థితి లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు టిడిపి నేతలు, కార్యకర్తలు అక్కడ ఓటు హక్కు లేకపోయినా కౌంటింగ్ కేంద్రాల్లో హడావుడి చేశారు. సమయం మించిన తరువాత కూడా దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్ వద్ద ఈ ప్రయత్నాలను అడ్డుకోబోయిన పిడిఎఫ్ అభ్యర్థి మద్దతుదారుడు అనిల్ కుమార్‌పై టిడిపి బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు దాడి చేశాడు. దీంతో బాధితుడు అనిల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు.

### భట్టిప్రోలులో ఏజెంట్‌పై టిడిపి నేతల దాడి

భట్టిప్రోలు టిఎం.రావు ఉన్నత పాఠశాల లోని 397 పోలింగ్‌బూత్‌లో దొంగ ఓట్లు నిరాకరించినందుకు కేఎస్.లక్ష్మణరావు ఎన్నికల ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లింగం శ్రీనివాసరావుపై భట్టిప్రోలు తెలుగుదేశం కార్యకర్త కంభం సుధీర్ దాడికి పాల్పడ్డాడు. కంభం సుధీర్ తెలుగుదేశం అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు దొంగ ఓటు వేసేందుకు మూడుసార్లు ప్రయత్నించాడు. తిరిగి మరలా వెళ్లగా లక్ష్మణరావు ఏజెంట్ అందుకు అభ్యంతరం తెలిపారు. ఆగ్రహించిన కంభం సుధీర్ 'నన్నే ఆపుతావా..' అంటూ శ్రీనివాసరావు చొక్కాన పట్టుకొని కిందపడేసి అతని ఐడెంటిటీ కార్డుని చించేవాడు. ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ దాడిని తీవ్రంగా ▶ 2లో

# బడ్జెట్‌లో జిల్లాకు దక్కేదెంత.?

- మంత్రి, ఎమ్మెల్యేల ప్రయత్నాలకూ పరీక్ష
- వెలిగొండకు రూ.2 వేల కోట్లు కేటాయిస్తేనే ముందుకు..
- నిధుల్లేక ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలూ పడకేసిన వైనం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కూటమి అధికారంలోకి వచ్చాక ఒక దఫా ఓటాన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా.. ఇప్పుడు వచ్చే ఏడాదికి సంబంధించిన పూర్తి బడ్జెట్‌ను శుక్రవారంనాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ముందుగా కేబినెట్ సమావేశమై.. అందులో ఆమోదముద్ర వేశాక అసెంబ్లీలో ప్రవేశపెడుతున్నారు. ఇదంతా పాలనా వ్యవహారాల నియమాల మేరకు సాగే ప్రక్రియ. ఇక బడ్జెట్ అనగానే జిల్లాలో అవసరాలు ముందుకు వస్తాయి. అన్నింటికీ బడ్జెట్ కీలకం. కేటాయింపులు ఇక్కడే జరుగుతాయి. జిల్లాలో కీలక రంగాలను గుర్తించి నేతలు ముందుగానే ఆర్థిక మంత్రితో గానీ, ఇంకా ముఖ్యమనుకుంటే సిఎంతో గానీ భేటీ అయి వారికి వివరించి నిధులు రాబట్టుకోవాలి. ఈ ప్రక్రియ జరిగితే ఎక్కువ నిధులు కేటాయించే అవకాశం ఉంది. ఈ తరహా భేటీలు జరగలేదు. ఉమ్మడి ప్రకాశంలో ఇద్దరు మంత్రులున్నారు. శాసనసభ్యులూ కీలకంగానే ఉన్నారు. నిధుల కోసం చేసిన ప్రయత్నాలు ఏమిటి? అన్నదీ ప్రశ్నార్థకంగానే మారింది. ఇంకా చెప్పాలంటే బడ్జెట్‌లో కేటాయింపులు మంత్రి, ఎమ్మెల్యేల ప్రయత్నాలకు పరీక్షగానే చెప్పక తప్పదు. ఏ రంగాలకు ఎంత కేటాయింపులు వచ్చేలా చేశారనేదీ బడ్జెట్ వెలువడితే గానీ తెలియదు. జిల్లాలో కీలకంగా ఇప్పుడు వెలిగొండ ప్రాజెక్టు. దీనికి రూ.2 వేల కోట్లు కేటాయిస్తే తప్ప ముందుకుపోవడం కష్టం. ఇప్పటికే రూ.6 వేల కోట్లకు పైగా వెచ్చించారు. ఇంకా రూ.నాలుగు వేల కోట్లు కేటాయించాలి. రెండేళ్లలో దీన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. గత ఓటాన్ బడ్జెట్‌లో రూ.390 కోట్లు చూపారు. ఇవి కూడా ఎంత ఖర్చయ్యాయనేదీ స్పష్టత లేదు. వెలిగొండ కోసం వామపక్షాలు ఆందోళన చేపట్టాయి. సిపిఎం దశలవారీగా ఆందోళన నిర్వహిస్తోంది. మంత్రి డోలా వీరాంజనేయస్వామి, జిల్లా ఎమ్మెల్యేలకు వెలిగొండ ఓ సవాలుగానే మారనుంది. ఎందుకంటే దీనిపై దృష్టి పెట్టినట్లు కనిపించినా నిధులు రాబట్టడంలో వైఫల్యం కనిపిస్తోంది. పశ్చిమ ప్రాంత ఎమ్మెల్యేలు అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో వెలుగొండకు భారీగానే కేటాయింపులు ఉంటాయనే ఆశతో రైతులు, నిర్వాసితులు ఉన్నారు. మిగతా సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తే గుండ్లకమ్మ గేట్లు దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి. పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పెండింగ్‌లోనే ఉంది. భవనాశి చెరువును రిజర్వాయర్‌గా మార్చే ప్రతిపాదన కూడా ముందుకు సాగడం లేదు. ఈ రెండు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిధిలోనే ఉన్నాయి. మంత్రి డోలా నియోజకవర్గంలో సంగమేశ్వర ప్రాజెక్టు ఉంది. 2009లో దీన్ని రూ.50 కోట్లా 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టారు. ప్రాజెక్టు పనులు ముందుకు ▶ 2లో



మాట్లాడుతున్న చుండూరి రంగారావు

రైతాంగంపై

## ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టాలి

8లో

# ప్రశాంతంగా శాసనమండలి ఎన్నికలు

## 'కూటమి' నేతల దౌర్జన్యకాండ

(మొదటిపేజీ తరువాయి)

ఖండించారు. తెలుగుదేశం కార్యకర్తలు మధ్యాహ్నం నుండి విచ్చలవిడిగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, అనేక మార్లు పోలింగ్ ఆఫీసర్, విధుల్లో ఉన్న ఎస్‌ఐకి ఫిర్యాదు చేసినా వారు సరిగా స్పందించలేదని చెప్పారు. బాధితుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటన పూర్తిగా పోలింగ్ కేంద్రంలో ఉన్న సిసి ఫుటేజీలో లభ్యమవుతుందని, అవసరమైతే దానిని కూడా పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మొరుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, దీపాల సత్యనారాయణ, రవీంద్ర పాల్గొన్నారు.

**మంత్రి ఫోన్ చేస్తారు..వివరణ ఇవ్వు..**

'మేము అధికార పార్టీ వాళ్లం. నువ్వు లోకల్.. పొద్దున్నుంచి మమ్మల్ని చూస్తూనే ఉన్నావు.. గుర్తింపుకార్డు లేదని మా వాళ్లని ఆపుతావా.. నువ్వు అంత నిజాయితీపరురాలివా.? నీ గురించి అంతా తెలుసు.. సర్లే ఆగు మంత్రి ఫోన్ చేస్తారు ఆయనకి వివరణ ఇద్దువు గానీ.. ఇందుకా మిమ్మల్ని ఇక్కడ ఉద్యోగాల్లో కావాలని మేము వేయించుకుంది..' అంటూ మహిళా అధికారి అని కూడా చూడకుండా ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న నిజాంపట్నం రెవెన్యూ ఆర్‌ఐ హనీపై అధికార పార్టీ నాయకులు మాటలతో విరుచుకుపడ్డారు. ఈ ఘటన బాపట్ల జిల్లాలోని రేపల్లె నియోజకవర్గం, నిజాంపట్నం గ్రామం ఎంపీయుపి పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్ వద్ద గురువారం జరిగింది. పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచి పోలింగ్ ముగిసేంత వరకు అధికార పార్టీ నాయకులు తెగ హడావుడి చేశారు. పోలింగ్ చివరి దశలో తమదైన శైలిలో పావులు కదపాలని చూశారు. ఈ తరుణంలో గుర్తింపు కార్డులు లేకుండా కొందరిని స్లిప్పులుతో పోలింగ్ కేంద్రంలోనికి సరాసరి తీసుకొచ్చి వారిని ఓటింగ్ వేసేందుకు అనుమతించాలని అధికార పార్టీ నేతలు కోరారు. విషయం గమనించిన ఎన్నికల విధులలో ఉన్న ఆర్‌ఐ హనీ, మహిళా పోలీసులు వారిని అడ్డుకొని పోలింగ్ బూత్ పిఒ దష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన గుర్తింపు కార్డు లేకుండా పోలింగ్‌కు అనుమతించబోమని తక్షణమే వారిని వెళ్లిపోవాలని సూచించారు. ఈ విషయమై కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికారులు అందరూ ఒకే మాటగా తమ ఎన్నికల విధులకు ఆటంకం కలిగించవద్దని చెప్పారు. అక్కడ విధుల్లో ఉన్న ఎస్సై ను పిలిపించి గుర్తింపు కార్డులు లేని వారిని బయటికి పంపించారు. అది జీర్ణించుకోలేని టిడిపి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకష్ణ, మండల పార్టీ నాయకులు వెంకట యాదవ్ పలువురు కలసి ఎన్నికల విధుల్లో ఉన్న నిజాంపట్నం ఆర్‌ఐ హనీతో వాగ్వాదానికి దిగారు. తామెవరిమో తెలియదా అంటూ కన్నెర్ర చేసి ఆమెను బెదిరించారు. 'మంత్రి కాడ నుండి ఫోన్ వస్తుంది ఆయనకు ఏం సమాధానం చెప్పుకుంటావో చెప్పుకో అధికార పార్టీ వాళ్ళమని తెలిసి కూడా ఇలా చేస్తారా.. పోనీలే అని సరిపెట్టుకుంటుంటే ఇలా ప్రవర్తిస్తారా చూద్దాం..' అంటూ ఆమెను భయభ్రాంతులకు గురి చేశారు. నిజాంపట్నం పోలింగ్ కేంద్రంలో అధికారులు అందరూ బాధ్యతగా వారి విధులు నిర్వహించడంతో చివరి నిమిషంలో అధికారపార్టీ నేతలు చేసిన హడావుడి మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

### జిల్లా కలెక్టర్ వెంకట మురళి



సిబ్బందితో మాట్లాడుతున్న బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

**ప్రజాశక్తి - బాపట్ల జిల్లా**

జిల్లాలో పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు బాపట్ల జిల్లాలోని 12 మండలాలలో గురువారం జరిగాయి. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి రేపల్లె, బాపట్ల మండలాలలో పర్యటించారు. రేపల్లె పట్టణం ప్రకాశం మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఒకే ప్రాంతంలో 404, 405, 406, 407, 407ఎ ఐదు పోలింగ్ కేంద్రాలు, అక్కడే 3,340 మంది ఓటర్లు ఒకే పాఠశాల పరిధిలో ఉండడంతో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లి పోలింగ్ సరళిని ఆయన నిశితంగా పరిశీలించారు. పోలింగ్ విధానం, పోలింగ్ శాతంపై పిఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వేచ్ఛగా ఓటు వేయడానికి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ నేరుగా ఓటర్లతోనూ ఆయన మాట్లాడారు. క్యూలో నిల్చొని ఒక్కొక్కరు ఓటు వేయడానికి కొంత సమయం పడుతుందని ఓటర్లు ఆయన దష్టికి తెచ్చారు. పోలింగ్ ప్రక్రియ వేగంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. సెక్టార్, రూట్ ఆఫీసర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, తహసిల్దార్ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. శాసనమండలి ఎన్నికలలో శాంతిభద్రతలకు ఎక్కడ ఎలాంటి విఘాతం కలగలేదని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. బాపట్ల పట్టణం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని 413, 414, 413-ఏ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. బాపట్ల పట్టణంలో పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.

ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. బాపట్ల జిల్లాలోని బాపట్ల, వేమూరు, రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 12 మండలాలలో ఎన్నికలు జరిగాయని చెప్పారు. పట్టభద్రుల ఓట్లు అధికంగా ఉన్న రేపల్లె, బాపట్ల మండలాలలో పరిశీలించామన్నారు. ఓటర్లకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహశీల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు

## ఉర్దూ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ఉర్దూ పాఠశాలను హైస్కూల్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. యర్రగొండపాలేనికి వచ్చిన జిల్లా కలెక్టర్‌ను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై అర్జీ అందజేశారు. జగనన్న కాలనీలో బినామీ ప్లాట్లు రద్దు చేయాలని, యర్రగొండపాలెం పట్టణంలోని ఉర్దూ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని, గ్రామాలలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలకు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ సేవానాయక్, టిడిపి నాయకులు మంత్రూనాయక్, మెడబలిమి అచ్యుతరావు, మస్తాన్‌వలి, చేకూరి సుబ్బారావు, గోపాల్ నాయక్, చేదూరి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో జిల్లాకు దక్కేదెంత.?

(మొదటిపేజీ తరువాయి)

సాగలేదు. కరకట్ట పనులు మాత్రం జరిగాయి. అసంపూర్తిగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయం ఇప్పుడు రూ.200 కోట్లకు పైగానే పెరిగిందని అంచనా. దీన్ని ఎలా ముందుకు తీసుకుపోతారన్నది మంత్రి డోలా కృషిపై ఆధారపడి ఉంది. ఇక తాగునీటి అవసరాలకూ భారీగా నిధులు కావాలి. వెలిగొండ, గుండ్లకమ్మ, రామతీర్థం, దర్శి వద్ద ప్రతిపాదించిన పథకాలకు రూ.5 వేల కోట్లు నిధులు అవసరమని అంచనా వేశారు. ఒంగోలు నగరంలో తాగునీటి పథకం నిధుల్లేక ముందుకు సాగడం లేదు. ఏటా వేసవిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి ట్యాంకర్లతో నీటిని తరలించాల్సి వస్తోంది. రహదారుల విషయానికి వస్తే ఒంగోలు-బేస్తవారిపేట ప్రధాన రహదారి ఇప్పటికీ విస్తరణకు నోచుకోలేదు. గతంలో ఎంపీగా ఉన్న వైవీ కూడా ఢిల్లీస్థాయిలో ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేదు. ఇప్పుడు దీన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి టోల్ పరిధిలోకి చేర్చేలా చూస్తున్నారు. ఇందుకోసం అధ్యయనం చేపట్టారు. మరో ఏడాది తర్వాతే దీనిపై స్పష్టత రానుంది. బిఓటీ పద్ధతిలో చేస్తారా? లేదా? అనేదీ తేలనుంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి చేపట్టే యోచనలో కనిపించడం లేదు. ఇంకా జిల్లా డెయిరీ మూతపడే ఉంది. ఒంగోలులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు హామీ ఉంది. కనిగిరి, దొనకొండ పారిశ్రామికవాడలూ ఎండమావులుగానే ఉన్నాయి. ఒంగోలు సమీపంలో ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టుకు 600 ఎకరాల స్థలం కోసం వాన్‌పిక్ సంస్థకు డబ్బు చెల్లించాల్సి ఉంది. కొత్తపట్నం వద్ద ఫిషింగు హార్బర్ పనులూ మొదలుకాలేదు. రైతులకు గిట్టుబాటు ధరల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు కావాలి. బడ్జెట్‌లో దీని ప్రస్తావన ఉంటుందా? లేదా? చూడాలి. ఇక కొత్తగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ పెండింగులోనే పెట్టారు. ఇక ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు భారీగా నిధులు అవసరం ఉంది. ఏదేమైనా జిల్లాలో అవసరాలు భారీగానే ఉన్నాయి. బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉంటాయో చూడాలి.

## ఉపాధి పనులను వేగవంతం చేయాలి

### ఎంపీడీవో సురేష్‌బాబు

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**

మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులను సంప్రదించి ఉపాధి పనులను గుర్తించాలని కోరారు. ఉపాధి పనుల్లో కూలీలను పెంచాలని అన్నారు. మండలానికి 60 రైతు వారి కుంటలు మంజూరయ్యాయని, వాటి అంచనాలు సిద్ధం చేయాలని అన్నారు. గోకులం పశువుల షెడ్డు నిర్మాణాలను నూరు శాతం పూర్తి చేయాలని వెల్లడించారు. గ్రామాల వారీగా ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ఏపీవో వాసంతి, ఈసీ బాబు, టీఏ, ఎఫ్ఏలు, సిఓఏలు పాల్గొన్నారు.

## అంబవరంలో 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్**




రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గిద్దలూరు మండలం అంబవరం, వెల్లుపల్లి గ్రామాల్లో గురువారం గిద్దలూరు మండల వ్యవసాయాధికారి వై.విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ చేపట్టినట్లు దీని ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తా మని తెలిపారు. ఉద్యానశాఖ అధికారి పి.విష్ణుప్రియ మాట్లాడుతూ కొత్తగా వ చ్చిన ఫార్మర్ చాట్ అప్లికేషన్ ద్వారా వాతా వరణంలో మార్పులు, పంటల మార్కెట్ ధరలు, చీడ పీడలు, వాటి నివారణ చర్యలు తెలుసుకోవచ్చని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సూక్ష్మ నీటి యాజమాన్యశాఖ అధికారి మోహన్ కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శేఖర్, మొహమ్మద్ నూర్, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ముత్తుముల ప్రత్యేక పూజలు

**ప్రజాశక్తి-అర్ధవీడు**

అర్ధవీడు మండలం కాకర్ల, యాచవరం గ్రామాల్లో గురువారం శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ నాయకులు ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుములను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే చెర్లో దొనకొండ గ్రామంలో గురువారం గురుపోలయ్య స్వామి తిరునాల సందర్భంగా బండ పందేలు, పాట కచేరీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సుదర్శన్ యాదవ్, టీడీపీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు, వేంకటేశ్వర్లు, కాకర్ల, యాచవరం గ్రామ నాయకులు, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా బ్యాటరీ ఆటోలు

**తుప్పు పట్టి మరమ్మతులకు గురైన వైనం**

**లక్షల్లో ప్రజాధనం వృధా, పట్టించుకోని ప్రభుత్వం**




తుప్పు పట్టి నిరుపయోగంగా ఉన్న వాహనాలు

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

గ్రామాల్లో చెత్తసేకరణకు కొనుగోలు చేసిన బ్యాటరీ ఆటోలు నిరుపయోగంగా ఉన్నాయి. వినియోగానికి నోచుకోకపోవడంతో తుప్పు పట్టాయి. దీంతో లక్షల్లో ప్రజాధనం వృథా అయింది.

2019లో టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపరిచి చెత్తసంపద కేంద్రాల ద్వారా ఆదాయ వనరులు సమకూర్చే విధంగా మండలానికి 11 బ్యాటరీ ఆటోలు మంజూరు చేసింది. వాటి ఖరీదు ఒక్కొక్కటి సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుంది. వీటి నిర్వహణకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా డ్రైవర్లను భర్తీ చేసేలా ఏర్పాటు చేసింది. దీని ద్వారా తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా సేకరించి చెత్త సంపద కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలకు ఆదాయ వనరులు చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఆ పథకం అమలు చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. ఆ తరువాత ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది . ఆ తరువాత ఆటోలను అసలు పట్టించుకోలేదు. దాంతో ఆ ఆటోలు నాగులుప్పలపాడు పంచాయతీలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. అనంతరం నూతనంగా పంచాయతీ సచివాలయంలోకి మారడంతో ఇటీవల మండల పరిషత్ కార్యాలయానికి తరలించారు. దాంతో అవి తుప్పుపట్టి దర్శన మిస్తున్నాయి. పథకం అమలుకు నోచుకోకపోవడంతో పంచాయతీలకు వచ్చే ఆదాయ వనరులు కోల్పోయినట్లయింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా వాటికి మరమ్మతులు చేపట్టి పంచాయతీలకు పంపిణీ చేసి గాడిలో పెట్టే చర్యలు తీసుకోలేదు. దీంతో ఆటోలు మండల పరిషత్ కార్యాలయంలో నిరుపయోగంగా పడిఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆటోలను వినియోగంలోకి తేవడం ద్వారా అటు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడటమే కాకుండా పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న సశుసంవర్ధక శాఖ సహాయకులు

## హాజరు వెసులుబాటు కల్పించాలి

**మంత్రికి పశుసంవర్ధక శాఖ సహాయకుల వినతి**

**ప్రజాశక్తి-టంగుటూరు**

ఏ గ్రామం నుంచైనా హాజరు వేసుకునేలా వెసులుబాటు కల్పించాలని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నుంచి మూడు గ్రామాలు క్లస్టరుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. 2 వేల పశువులకు ఒక సహాయకుడిని నియమించడం జరిగిందన్నారు. గతంలో మాకు ఏ గ్రామం నుంచి అయినా హాజరు వేసుకోవడానికి వీలు ఉండేదని, ఈ వెసులుబాటు తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అత్యవసర వైద్య సేవల విభాగానికి చెందిన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అటెండెన్స్‌లో వెసులుబాటు కల్పించాలని కోరారు.

## పొజిషన్ సర్టిఫికెట్‌లు సకాలంలో అందించాలి

**ప్రజాశక్తి-టంగుటూరు**

గృహ నిర్మాణాలకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు ఇబ్బందులు లేకుండా ప్రజలకు సకాలంలో అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం నాడు తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహశీల్దార్లు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు, హౌసింగ్ పీడీతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల కోసం అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. భూరీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరిశ్రమలకు భూములు కేటాయించే అంశంలో రైతులు, కలెక్టర్‌తో సంప్రదించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కేటాయింపులు జరపాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయ యానిమల్ హస్బండ్రీ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అటెండెన్స్ ఆప్షన్‌లో అదర్ ఆప్షన్‌ని పునరుద్ధరించరాలని మంత్రిని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.



మాట్లాడుతున్న మంత్రి స్వామి

## హరిహర క్షేత్రంలో శాంతి కళ్యాణం

**ప్రజాశక్తి-చీమకుర్తి**

స్థానిక హరిహర క్షేత్రంలో నగరేశ్వర స్వామి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాసవి గ్రానైట్స్ అధినేతలు శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా బాలాజీ దంపతులు పాల్గొని విశిష్ట పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలు, ముత్యాలు సమర్పించారు. జ్యోతి లింగార్చన, లింగోద్భవ పూజలు నిర్వహించారు. దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర్లు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఉభయగోదావరి జిల్లాకు చెందిన వేద పండితులు ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. అన్నదానం చేశారు.




శాంతి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

# రోజూ 60 మందికి కేన్సర్ పరీక్షలు నిర్వహించాలి

**వైద్యాధికారులకు డిఎంహెచ్ఒ వెంకటేశ్వర్లు ఆదేశం**

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఎన్‌సిడి సిడి 3.0 కార్యక్రమంలో రోజుకి 25-30 కుటుంబాలు లేదా 60 మందికి నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక డిఎంహెచ్ఒ ఛాంబర్‌లో గురువారం ఆయన జిల్లాలోని ప్రోగ్రామ్ ఆఫీసర్స్, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ అధిక రక్తపోటు, మధుమేహ పరీక్షలు కూడా ప్రజలకు చేయాలని సూచించారు. ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి పరీక్ష చేసిన కేన్సర్ అనుమానితుల కేసులను వైద్యాధికారికి రిఫర్ చేయాలన్నారు. వైద్యాధికారి ఆ కేసులను ఒంగోలు జిజిహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ రూమ్ నెంబర్ 222కి రెఫర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం, ఎన్ఎఫ్ఎస్ నిర్దేశించిన నిబంధనల ప్రకారం జనాభాలో 26 శాతం మధుమేహంతో, 30 శాతం అధిక రక్తపోటుతో బాధపడుతున్న వారిని గుర్తించి సత్వర వైద్యసేవలందించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్‌సిడి సిడి 3.0 కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను విధిగా సాధించాలని, సాధించని వైద్యాధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌సిడి సిడి నోడల్ అధికారి డాక్టర్ భగీరధి, డిపిఎంఒ డాక్టర్ వాణిశ్రీ, ఎపిడమాలజిస్ట్ విక్టర్ కుమార్, జిల్లా డేటా మేనేజర్ చల్లా ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెంచుగరటయ్య

## నిబద్ధత కలిగిన వ్యక్తి ఆంజనేయులు

**మాజీ శాసనసభ్యులు బాచిన గరటయ్య**

**ప్రజాశక్తి -వేటపాలెం**

నిబద్ధత కలిగిన వ్యక్తి నక్కల ఆంజనేయులు అని అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య తెలిపారు. మండల పరిధిలోని పందిళ్ళపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన నక్కల ఆంజనేయులు యాదవ్ చిత్రపటానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా గరటయ్య మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి నక్కల ఆంజనేయులు నిబద్ధతతో పనిచేసి మంచి గుర్తింపు పొందారన్నారు. స్థానిక ప్రజలలో తలలో నాలుకలా మెలిగేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి యాజలి సుధాకర్ రావు, నక్కల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## జూదరులు అరెస్టు

**ప్రజాశక్తి-ఒంగోలు క్రైం**

ఒంగోలు మండలంలోని పెద్దదేవరంపాడులో కోడిపందేలు నిర్వహిస్తున్న జూదరులను తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 12 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు జూదరులను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు. తాలూకా ఎస్ఐ జి.సందీప్ కేసు నమోదు చేశారు.

## ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలి

**జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ**

**ప్రజాశక్తి-టంగుటూరు**

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ అన్నారు. మండలంలోని కొణిజేడు గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పట్టదారుల సమక్షంలో మాత్రమే సర్వే చెయ్యాలన్నారు. సుదూర ప్రాంతాలలో హైదరాబాద్, బెంగళూర్‌లలో నివసిస్తున్న రైతుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకొని వారికి వాట్స్‌ఆప్ ద్వారా సమాచారం అందించి వారిని రీసర్వేలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వేలో మొదటగా విలేజ్ బౌండరీ, బ్లాక్ బౌండరీ, ప్రభుత్వ భూముల బౌండరీ పూర్తి చేసిన తర్వాత మాత్రమే పట్టా భూముల సర్వే పని మొదలు పెట్టాలన్నారు. రైతులకు ఇచ్చిన నోటీసులకి సంబంధించి రశీదులతో కూడిన రిజిస్టర్ కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌పి జిల్లా అధికారి రత్న ప్రసాద్

## చట్టాలపై అవగాహన

**ప్రజాశక్తి-కొండపి**

బాల్య వివాహాలు, లింగ వివక్షత, పోక్సో యాక్టు, చైల్డ్ మ్యారేజెస్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రిసోర్స్ పర్సన్ రత్నప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకుంటే వాటి వల్ల కలిగే నష్టాలను, లింగ వివక్షత, పోక్సో కేసు వాటి సెక్షన్లు ఏ సెక్షన్‌కి ఎంత కాలం శిక్ష పడుతుంది అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియా, మాధవి లత, పొన్నలూరు, మర్రిపూడి, కొండపి సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# పనులు లేక.. పూట గడవక..

- ఉన్న వృత్తిని వీడలేక మరో వృత్తిలో సాగలేక అవస్థలు
- రెడీ మేడ్ వస్త్రాలతో తగ్గిన పనులు
- దుస్తులు కుట్టించుకొనేందుకు ఆసక్తి చూపని ప్రజలు
- దర్జీల దీన పరిస్థితి ఇది

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

నాడు ఓ వెలుగు వెలిగిన దర్జీలు నేడు దుర్భర జీవనం సాగిస్తున్నారు. పనులు లేక పూట గడవక అవస్థలు పడుతున్నారు. రెడీ మేడ్ వస్త్రాల రాక వారి తలరాతను మార్చివేసింది. దుకాణల నిర్వాహణ కూడా కష్టం మారింది. ఉన్న వృత్తిని వదలలేక .. కొత్త వృత్తిలో సాగక అవస్థలు పడుతున్నారు. మార్కెట్ లోకి వస్తున్న కొత్త, కొత్త ఫ్యాషన్లకు అనుగుణంగా దుస్తులు కుట్టే నేర్పు ఉన్న.. రెడీమేడ్ దుస్తుల వల్ల టైలర్లకు ఆదరణ తగ్గుతూ వస్తోంది. గతంలో పండుగలు, శుభకార్యాల సమయంలో దర్జీలకు చేతినిండా పని ఉండేది. ప్రజలు కూడా కొత్త దుస్తులు కుట్టించుకునేందుకు టైలర్ల వద్దకు క్యూ కట్టేవారు. టైలర్ వత్తి రోజురోజుకి అనేక మార్పులకు గురవుతూ వచ్చింది. ఇప్పుడు ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా మారింది. పాత కుట్టు మిషన్ల స్థానంలో


దుస్తులు కుడుతున్న మహిళలు

అత్యాధునిక మిషన్లు వచ్చాయి. కంప్యూటర్ల ప్రవేశంతో ఎలాంటి డిజైన్ అయినా అలవోకగా తీర్చిదిద్దే విజ్ఞానం అందుబాటులోకి వచ్చే సింది. రెడీమేడ్ దుస్తుల రాకతో టైలర్ వత్తి సంక్షభంలో కురుకుపోతుంది. ఫ్యాషన్ డిజైన్ మోజులో పడి టైలర్‌తో దుస్తులు కుట్టించుకునే వారు గణనీయంగా తగ్గిపోయారు. నేడు టైలర్స్ డే సందర్భంగా దర్జీల జీవన పరిస్థితులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

### టైలర్ షాపులు వెలవెల

గ్రామ స్థాయి నుంచి పట్టణం వరకూ ప్రతి చోట టైలర్లు ఉన్నారు. షాపుల ద్వారా కొందరు, ఇళ్లలోనే మరికొందరు వస్త్రాలు కుడుతుంటారు. రెడీమేడ్ దుస్తులు తక్కువ ధరలకే లభిస్తున్నాయి. దీంతో వస్త్రం తీసుకుని టైలర్ల వద్ద కొలతలు ఇచ్చి కుట్టించుకునే వారు తగ్గిపోయారు. దుస్తులు కుట్టించుకునేందుకు వచ్చే వారి కోసం టైలర్లు ఎదురు చూసే పరిస్థితులు వచ్చాయి. సొంత షాపులు ఉన్న వారు ఎలాగోలా నెట్టుకొస్తుండగా... మిగిలిన వారు కుటుంబ పోషణతో పాటు అద్దెలు చెల్లించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

### సీజన్‌లోనూ పనులు లేవు

**పఠాన్ ఖాదర్ వలి**
**టైలర్ల సంఘం మండల అధ్యక్షులు, మార్టూరు**



గత 25 ఏళ్లుగా టైలర్ వత్తిలో ఉన్నా. రెడీమేడ్ దుస్తుల రాకతో క్లాత్ కుట్టించుకుని ధరించే వారి సంఖ్య పూర్తిగా తగ్గింది. పండుగలు,పెళ్లిళ్ల సీజన్‌లో కాస్త పని దక్కేది, ప్రస్తుతం అలాంటి సీజన్ లో కూడా పనులు లేవు.ఇతర వృత్తి చేయలేక టైలర్ పనితోనే నెట్టుకొస్తున్నా.

### టైలర్లకు పథకాలు అమలు చేయాలి

**బాల నాగేశ్వరి, టైలర్ల సంఘం అధ్యక్షురాలు**



పొట్ట నింపని టైలర్ వృత్తిలో ఉన్న టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. కంప్యూటర్ టైలరింగ్ లో శిక్షణ ఇస్తే ఉపయోగ కరంగా ఉంటుంది.


అజాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## ఆజాద్ జీవితం నేటి తరానికి ఆదర్శం

**ప్రజాశక్తి-బాపట్ల**

బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించి వారికి సింహ స్వప్నంగా మారిన చంద్రశేఖర్ ఆజాద్ నేటి తరానికి ఆదర్శం కావాలని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి.సాయిబాబు తెలిపారు. చంద్రశేఖర్ ఆజాద్ 94 వ జయంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో విద్యా వనరుల కేంద్రం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న తొలి సాయిధ పోరాట యోధుడు ఆజాద్ అని తెలిపారు. లాలా లజపతిరాయ్ మతికి కారణమైన ఆంగ్లేయ అధికారులపై ప్రతీకారం తీర్చుకొని భారతీయుల సత్తా చాటినట్లు తెలిపారు. ఆంగ్లేయుల చేతికి చిక్క కూడదనే ఆలోచనతో చివరకు బ్రిటిష్ పోలీసులు చుట్టుముట్టిన తరుణంలో తనను తానే పిస్తోల్ తో కాల్చుకొని, ఆజాద్ అమరుడయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జమద్‌బాషా, సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, ఉపాధ్యాయ సంఘ నాయకులు బడుగు శ్రీనివాస్, అజాద్ చంద్రశేఖర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ ఓట్లు వేసేందుకు యత్నం

## అడ్డుకున్న పిడిఎఫ్ ఏజెంట్లు

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కొందరు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు. పిడిఎఫ్ ఏజెంట్లు వారి అడ్డుకున్నారు. చెరుకుపల్లి మండలంలో మొత్తం 2034 ఓట్లకు గాను 1518 ఓట్లు పోలయ్యాయి. స్థానిక గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలలో తహశీల్దారు సిహెచ్.పద్మావతి పర్యవేక్షించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పోలింగ్ సరళని పరిశీలించారు. వైసిపి రేపల్లె నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరి గణేష్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**రేపల్లె :** ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు అండ దండలతో రేపల్లె మండలం పిరాట్లంక 408 పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్ చేసినట్లు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. అక్కడ రీపోలింగ్ జరపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిశాయి. స్థానిక ప్రకాశం మున్సిపల్ హై స్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కొనేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు ఓటర్లకు అసౌకర్యం కలగకుడా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత, క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, తహాశీల్దారు శ్రీనివాసరావు, డిఎస్‌పి సాంబశివరావు పోలింగ్ కేంద్రాల పర్యవేక్షిస్తూ ఓటర్లకు సూచనలు చేశారు. మండలంలో 76.25 శాతం ఓటింగ్ నమోదైనట్లు పోలింగ్ అధికారులు తెలిపారు.

**కొల్లూరు :** కృష్ణ,గుంటూరు జిల్లాల ప్రట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు చెదురుమదరులు ఘటనలతో ముగిశాయి. అధికార పార్టీ నాయకులు దొంగ ఓట్లు వేయించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించి అధికారులతో మాట్లాడారు. 395 పోలింగ్ కేంద్రంలో 871 ఓట్లను గానూ 631 ఓట్లు పోలయ్యాయి. 396 పోలింగ్ కేంద్రంలో 938 ఓట్లకు గానూ 696 ఓట్లు పోలయ్యాయి. మండలంలో 73.4 శాతం పోలింగ్ శాతం నమోదైంది.

**నిజాంపట్నం :** మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి .నిజాంపట్నంలోని ఏజీకే పేట ప్రభుత్వ పాఠశాల, అడవులదీవి ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. నిజాంపట్నం పోలింగ్ కేంద్రంలో 740 మంది ఓటర్లకు గాను 475 మంది ఓటు హక్కును వినియెాగించుకున్నారు. అడవులదీవి పోలింగ్ కేంద్రంలో 840 మంది ఓటర్లు గానూ 656 మంది తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. నిజాంపట్నంలోని 409 పోలింగ్ కేంద్రంలో 64.18 శాతం, అడవులదీవిలోని 410 పోలింగ్ పోలింగ్ కేంద్రంలో 78.09 శాతం ఓటింగ్ నమో దైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నిజాంపట్నం, అడవులదీవి పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సందర్శించారు. పోలింగ్ తీరును తహశీల్దారు షాకీర్ పాషా పర్యవేక్షించారు.

**భట్టిప్రోలు :** కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అక్కడక్కడ స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగించాయి. భట్టిప్రోలు మండలంలో మొత్తం 1,982 ఓట్లు గానూ 1,446 ఓట్లు పోల య్యాయి. కొల్లూరు మండలంలో 1,806 ఓట్లు గానూ 1,328 ఓట్లు పోలయ్యాయి. అమృత లూరు మండలంలో 1,577 ఓట్లు గానూ 1,265 పోలయ్యాయి. చుండూరు మండలంలో 1,617 ఓట్లకు గాను 1,194 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు లేకపోవడంతో అధికార పట్టి నాయకులు నిరంతరం లోపలికి బయటికి తిరుగుతూ ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేస్తూ దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు.


చెరుకుపల్లి లో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి


చెరుకుపల్లిలో ఓటు వేసిన వైసిపి రేపల్లె నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరి గణేష్ దంపతులు


నిజాంపట్నంలో బారులు తీరిన ఓటర్లు


భట్టిప్రోలులో బారులు తీరిన ఓటర్లు


కొల్లూరులో బారులు తీరిన ఓటర్లు


రేపల్లెలో బారులు తీరిన ఓటర్లు

# భూముల రీసర్వే వేగవంతం

- 10 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూటింగ్ పూర్తి
- రీసర్వేకు రైతులు సహకరించాలి
- ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న


ఆర్డీవో లక్ష్మీప్రసన్న

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో భూముల రీసర్వే వేగవంతంగా జరుగుతోందని ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న తెలిపారు. రీసర్వేకు సంబంధించిన వివరాలను గురు వారం ఆమె వెల్లడించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న 12 మండలాల్లో ఒక్కో గ్రామం చొప్పున 12 గ్రామాలను మోడల్ విలేజ్‌లుగా ఎంపిక చేసి.. రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. తాళ్లూరు మండలంలో రామభద్రాపురం, మద్ది పాడులో కొలచనకోట, కొండపిలో సిఎబి కండ్రిక, జరుగుమల్లిలో ఎన్‌వివి కండ్రిక, నాగులుప్పలపాడులో పోతవరం, శింగరాయ కొండలో బింగినపల్లి, ఒంగోలులో యర్రజర్ల, కొత్తపట్నంలో ఆలూరు, టంగుటూరులో కొణిజేడు, చీమకుర్తిలో దేవరపాలెం, సంతనూతలపాడులో మట్టిపాడు, ముండ్లమూరులో వేంపాడు గ్రామాలలో రీసర్వే జరుగుతోంద న్నారు. సంబంధిత రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాటికే రామభద్రాపురం, కొలచనకోట, సిఎబి కండ్రిక, ఎన్‌వివి కండ్రికలో గ్రౌండ్ ట్రూటింగ్ (జి.టి.) పూర్తయ్యిందన్నారు. శుక్రవారం నాటికి పోతవరం, దేవరపాలెం, మట్టిపాడు, వేంపాడు, బింగినపల్లి, యర్రజర్లలో జి.టి. పూర్తవుతుందని పేర్కొన్నారు. ఎక్కువ మంది రైతులున్న కొణిజేడు, ఆలూరులో మార్చి 15 నాటికి గ్రౌండ్ ట్రూటింగ్ పూర్తవుతుందని చెప్పారు. గ్రౌండ్ ట్రూటింగ్ పూర్తయిన అనంతరం గ్రౌండ్ వెరిఫికేషన్ (జి.వి.) కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రామభద్రాపురం, కొలచనకోట, సిఎబి కండ్రిక, ఎన్‌వివి కండ్రికలో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా రైతులు తమ హక్కుపత్రాలతో ఈ రీసర్వేకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. హక్కు పత్రాల ఆధారంగా ఉన్న భూమిని పరిశీలించి.. రీసర్వే చేస్తామన్నారు. అనంతరం హక్కుదారులకు ఎల్‌పిఎం నెంబర్లు కేటాయిస్తామన్నారు. తర్వాత భూహక్కు పత్రాలు అందజేస్తామని చెప్పారు. ఈ రీసర్వేలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక విఆర్ఒ, ఒక విఆర్ఎ టీమ్‌గా ఉంటారని పేర్కొన్నారు. గ్రామాల్లో రైతులతో కలిసి ఒక వాట్సప్ గ్రూపును ఏర్పాటుచేసి.. వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామ ప్రజలు రీసర్వే కార్యక్రమానికి సహకరించాలని కోరారు.


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

## అన్నా క్యాంటీన్ తనిఖీ

**ప్రజాశక్తి-చీమకుర్తి**

స్థానిక మున్సిపల్ కార్యాలయం సెంటర్లోని అన్న క్యాంటీన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం రాత్రి 7 గంటల 30 నిమిషాల సమయంలో ఆయన అన్న క్యాంటీన్లో ఆహార పదార్థాలను పరిశీలించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య, తహశీల్దార్ బ్రహ్మయ్యతో మాట్లాడారు. అన్న క్యాంటీన్‌కు వస్తున్న వారి వివరాలు సేకరించారు. భోజనాలు చేస్తున్న వారితో మాట్లాడి పదార్థాలు ఎలా ఉన్నాయని అడిగారు. క్యాంటీన్ సమయపాలనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత నాణ్యమైన, పరిశుభ్రమైన పదార్థాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నా క్యాంటీన్ నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్న క్యాంటీన్లపై కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ఫీడ్‌బ్యాక్ గురించి వివరించారు.

## పొగాకు రైతులకు శిక్షణ

**ప్రజాశక్తి-పొన్నలూరు**

పొగాకు బోర్డు ఒకటో వేలం కేంద్రం పరిధిలోని చవటపాలెం గ్రామంలో ఆకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్ మరియు పొగాకులో అన్య పదార్థాల నిర్మూలన వంటి అంశాలపై రైతులకు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గురువారం వేలం నిర్వహణ అధికారి ఎమ్.కిరణ్ మాట్లాడుతూ అడుగు ఆకులు వదిలేసి పక్వానికి వచ్చిన వాటిని మాత్రమే రేల్చాలన్నారు. ఆకు అల్లిక సమయంలో టార్పాలిన్ పట్టలు విడిగా వాడాలన్నారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచుకొని అన్య పదార్థాలను అందులో వేయాలని చెప్పారు. బ్యారెన్‌లో క్యూరోమీటర్ వాడాలని దీనివలన అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఇంకా బ్యారెన్‌లో క్యూరింగ్ సమయంలో తీసుకోవాల్సిన మెలకువలు, జాగ్రత్తలు గురించి తెలియజేశారు. సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ శివ కుమార్ మాటాడుతూ క్యూరింగ్‌ల వారీగా పొగాకు మండెలు పెట్టుకోవాలన్నారు. ఈ ఏడాది గ్రేడ్‌లు వారీగా మార్కెట్ ఉంటుంది కాబట్టి బేల్స్ కూడా అలానే కట్టుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీపీఐ మేనేజర్ కుమారి శ్రీ లేఖ, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

## మనసు పెడితే మంచి మార్కులు మీవే

**వ్యక్తిత్వ వికాస నిపుణులు 'వెల్‌విషర్' శంకర్**



మాట్లాడుతున్న వెల్‌విషర్ శంకర్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

మనసుపెట్టి ఏకాగ్రతతో చదివి పది పరీక్షలలో మంచి మార్కులు సాధించి ఉన్నత భవిష్యత్తు రూపొందించుకోవాలని ప్రముఖ మనోవిజ్ఞాన, వ్యక్తిత్వ వికాస నిపుణులు వెల్‌విషర్ శంకర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఒంగోలు పివిఆర్ బాలికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన పరీక్షా ప్రేరణ శిక్షణ గురువారం జరిగింది. ఈ శిక్షణలో ఆయన ఏకాగ్రత ఎలా సాధన చేయాలో, పరిశీలనాత్మకంగా ఎలా చదవాలో, తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పేటప్పుడు శ్రద్ధగా ఎలా వినాలో, నేర్చుకున్న విషయాలను నేర్పుగా సమర్థవంతంగా పరీక్షలలో ఎలా రాయాలో వివరించారు. ఈ సందర్భంగా వెల్‌విషర్ శంకర్ మనస్సు పనిచేసే తీరును తెలియజేస్తూ మీరు మీతో మాట్లాడుకునే మాటలే, మీ ఆలోచనలే మీ జీవితంగా రూపొందుతాయన్నారు. సానుకూల దృక్పథంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని మార్కులు ఎలా సాధించాలో సోదాహరణంగా వివరించారు. చదువు పట్ల ఆసక్తిని, ఇష్టాన్ని పెంచుకుంటూ కృషి చేస్తే ఉన్నతస్థాయికి ఎదగవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ పరీక్షల సన్నద్ధతకు రాసిన మార్కుల మెగాస్టార్ మీరే పుస్తకాన్ని పూర్వ విద్యార్థి సంఘ కమిటీ ఆవిష్కరించి పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం బి.లక్ష్మీప్రసన్న, అల్యూమినీ సభ్యులు బి.వి.సుబ్బారావు, ఓ.నరశింహాశాస్త్రి, తిరుపతి స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలి

**ప్రజాశక్తి-ముండ్లమూరు**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక అమలు చేస్తున్న విశిష్ట సంఖ్య కోసం రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మార్చి 5 నుంచి 10వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి జాబితాను ప్రదర్శిస్తామని తెలిపారు. కంది రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వేమూరి శ్రీ కీర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆంజనేయులు, క్రాంతి రత్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూపూడి ప్రభాకరరావు

## రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

**వైసిపి నాయకులు జూపూడి విమర్శ**

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్ఆర్ కాంగ్రెసు పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరి, అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు విమర్శించారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అరెస్టు చేయడాన్ని తమ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు పెడుతున్నారని, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడరని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తున్నారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎవరికి అన్యాయం జరిగినా, బాధితుల పక్షాన జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారని, వారికి అండగా పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ బిసి సెల్ నాయకులు బొట్లా సుబ్బారావు, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, మహిళా నాయకులు బడుగు ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.


సందడి చేస్తున్న విదేశీ పక్షులు

## విదేశీ పక్షుల సందడి

**ప్రజాశక్తి-పర్చూరు**

పర్చూరు మండలం వీరన్నపాలెం మంచినీటి చెరువులో విదేశీ వలస పక్షులు సందడి చేస్తున్నాయి. వివిధ రంగుల పక్షులు చెట్లు కొమ్మలపై కూర్చొని విహరిస్తున్నాయి. చెరువు మధ్య ఉన్న చెట్టుపై చేరి సందడి చేస్తున్నాయి. దీంతో ఆరహదారిలో ప్రయాణించే వాహనదారులు చెరువు దగ్గర ఆగి పక్షుల కిలకిల రాగాలను వింటూ ఆనందిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల తర్వాత మరల సైబీరియా పక్షులు ఇక్కడ రావడం ఎంతో ఆనందంగా ఉందని వీక్షకులు చెబుతున్నారు. సాధారణంగా సైబీరియా దేశానికి చెందిన పక్షులు ప్రతి ఏడాది డిసెంబరు, జనవరిలో వేలాది కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు చేరుకుంటాయి. ఐదారు నెలలపాటు ఇక్కడే ఉంటాయి.గుడ్లు పెట్టి పొదిగి పిల్లలను వృద్ధిచేస్తాయి. జూన్, జూలై నెలల్లో పిల్లలతో కలిసి తిరిగి స్వదేశానికి వెళ్లి పోతాయి.

## వైసీపీ పటిష్టతకు కృషి చేయాలి

**కార్యకర్తల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ**


మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

**ప్రజాశక్తి-చీమకుర్తి**

గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. స్థానిక బూచేపల్లి కార్యాలయంలో గురువారం జరిగిన వైసిపి మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి వైసీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ అధికార కూటమి ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత పెరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ఘనవిజయం సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సందర్భంగా మండల, పట్టణ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైసిపి మండల అధ్యక్షునిగా పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి పట్టణ అధ్యక్షునిగా క్రిష్టిపాటి శేఖర్ రెడ్డిని తిరిగి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు జి.ఓబుల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, మాజీ చైర్మన్ చల్లా అంకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

# విశిష్ట గుర్తింపు నమోదు తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-దర్శి**

దర్శిలోని నాలుగు రైతు సేవ కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ప్రకాశం జిల్లా ఎస్ శ్రీనివాసరావు రైతు విశిష్ట గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించడంతో రైతులందరు నమోదు చేయించుకోవాలని చెప్పారు. గ్రామాలకు వెళ్లి రైతు సేవ కేంద్రంలో విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఆ విధంగా చేయించుకున్న రైతులు మాత్రమే వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులు తెలిపారు. ఈ నెల 28లోపు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని అన్నారు. రైతుసేవ కేంద్రం సిబ్బంది రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎడిఎ కె బాలాజీనాయక్ పాల్గొని రైతులురైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని తెలిపారు. ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్‌బాబు, ఎఒ వి బాలకృష్ణ నాయక్, కంట అరుణ పాల్గొన్నారు.

**సిఎస్.పురం :** రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంట తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి బి సంపత్ కుమార్ తెలిపారు. మండలంలోని కంభంపాడు, పెద్దరాజుపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో సాగు చేసిన పప్పు శనగ, జొన్న పంటలను పరిశీలించారు. జొన్న పంటలో తీసుకోవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. పంట నమోదు, ఇకెవైసి వేయుటకు మార్చి 3 చివరి తేదీ అని చెప్పారు. ఆ లోపు సాగు చేసిన ప్రతిపంట నమోదు చేయించుకుని పంట నమోదు చేసిన వివరాలు ఒకసారి వెరిఫై చేసుకొని తంబు వేసి ధృవీకరించాలని తెలిపారు. కంది పంట సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రంలో సిఎం యాప్‌లో మద్దతు ధరకు అమ్ముకొనుటకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ డబ్బులు పడేటటువంటి రైతులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ రైతు సేవా కేంద్రంలో చేసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల నుండి ఏ పథకం రావాలన్నా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం కింద ఇచ్చే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట రుణాలు, వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం రవి, రాజశేఖర్, ఐ అఖిల్‌బాబు పాల్గొన్నారు.

**తాళ్ళూరు :** మండలంలోని దారంవారిపాలెం, తురకపాలెం గ్రామాల్లోని రైతులతో వ్యవసాయశాఖ అధికారి బి ప్రసాదరావు గురువారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ఉత్పత్తుల ముందస్తు ధరల అంచనా విశ్లేషించాలని అన్నారు. రైతులు పండించిన ఏ పంటలైనా పంట రకం, నాణ్యత, దిగుబడి, డిమాండ్ వినియోగం, అంతర్జాతీయ ధరలు, ఎగుమతులు, దిగుబడులు ఆధారంగా ధరలు మారుతూ ఉంటాయని అన్నారు. దీనిని అంచనా వేసుకొని రైతులు అవగాహన కలిగి అమ్ముకునేందుకు ప్రయత్నించాలని అన్నారు. కార్యక్రమంలో విఎఎలు నాగమల్లేశ్వరి, విఎహెచ్ బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సలహాలిస్తున్న సిఎస్‌పురం ఎఓ సంపత్ కుమార్



మాట్లాడుతున్న తాళ్ళూరు ఏవో బి ప్రసాదరావు

## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ




కొనకనమిట్ల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లాఎస్పీ ఆర్ దామోదర్

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

స్థానిక పోలీస్‌స్టేషన్ నిర్వహణను ఎస్పీ దామోదర్ అభినందించారు. ఆయన గురువారం పోలీస్‌స్టేషను తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన పలురికార్డులు నిశితంగా పరిశీలించారు. మరమ్మత్తులకు గురైన సీసీ కెమెరాలను వెంటనే బాగు చేయించాలని ఎఎస్‌ఐకు సూచించారు. మహిళల ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఉమెన్ హెల్త్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఇటీవల కాలంలో రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు తరచుగా చోరీలకు గురవుతున్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విలేకరులు ఆయన దృష్టికి తీసుకురాగా దొంగలను పట్టుకుని అరెస్టు చేస్తున్నామని తెలిపారు. వారి పట్ల ప్రత్యేక నిఘ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం స్టేషన్ ఆవరణను నిశితంగా పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పలురకాల మొక్కలను, ఫిర్యాదు దారులు వేసి ఉండేందుకు ఏర్పాటు చేసిన సిమెంటు బల్లాలను పరిశీలించి పోలీస్‌స్టేషన్‌ను ఎస్ఐ రాజ్‌కుమార్ బాగా చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎస్ఐ ముల్లా మహమ్మద్ ఉన్నారు.

## మహిళా కబడ్డీ పోటీల్లో 'విశాఖపట్నం' సత్తా

**- ద్వితీయ స్థానంలో విజయనగరం - 3, 4వ స్థానాల్లో ప్రకాశం, చిత్తూరు జట్లు**



మహిళల కబడ్డీ విజేతలను అభినందిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - పొదిలి**

మహాశివరాత్రి సందర్భంగా శ్రావణి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు గురువారం హెూరా హెూరీగా జరిగాయి. ఫైనల్స్‌లో వైజాగ్ బాలికల జట్టు విజేతలుగా నిలిచి మొదటి బహుమతి సొంతం చేసుకున్నారు. 2వ బహుమతి విజయనగరం, 3, 4వ స్థానాల్లో ప్రకాశం, చిత్తూరు జిల్లాల జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన ఒంగోలు మున్సిపల్ కౌన్సిలర్ మలగా రమేష్ మొదటి బహుమతి రూ.30వేల నగదును పొదిలి మండలం బైక్ యూనియన్ అధ్యక్షులు యుద్ధం శీను బహుకరించగా విశాఖపట్నం జట్టుకు అందించారు. 2వ బహుమతి రూ.20వేలను ఆముదాలపల్లి జనసేన నాయకులు దరిమడుగు రమేష్ దాతృత్వంతో విజయనగరం జట్టుకు అందజేశారు. స్థానిక రాంనగర్ జనసేన నాయకులు మారాబత్తిన స్వాములు చేతుల మీదుగా రూ.15వేలు, రూ.10వేలను ప్రకాశం, చిత్తూరు మహిళా జట్లకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. పండుగ సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త, నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు.



రూ.50వేలు విరాళం అందజేస్తున్న నాయబ్‌రసూల్

## డయాలసిస్ సెంటర్‌కు విరాళం

**ప్రజాశక్తి-సిఎస్.పురం**

ఫ్లోరైడ్ బాధితుల సహాయార్థం కనిగిరి డయాలసిస్ సెంటర్ ఆధునీకీకరణ కోసం కోవిలంపాడు (చంద్రపూర్) గ్రామానికి చెందిన షేక్ నాయబ్‌రసూల్ (బడే) రూ.50వేలు విరాళాన్ని అందజేశారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బడే నాయబ్‌రసూల్‌ను ఎంఎల్ఎ అభినందించారు. కార్యక్రమంలో కోవిలంపాడు గ్రామానికి చెందిన రజ్జబ్‌భాషా, షేక్ ఖలీల్, ఎపిటిఎఫ్ నాయకులు షేక్ నాయబ్‌రసూల్, రిటైర్డు టీచర్ పివి కృష్ణమోహన్, వీరభద్రపురం నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.



వికలాంగుల సర్టిఫికెట్లు కోసం వెరిఫికేషన్ చేస్తున్న వైద్యులు

## వికలాంగుల పత్రాలు పరిశీలన

**ప్రజాశక్తి-దర్శి**

ప్రభుత్వం జారీ చేస్తున్న సదరన్ ఫ్రీ వెరిఫికేషన్ వికలాంగుల సర్టిఫికెట్లు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో కనిగిరి వైద్యులు డాక్టర్ ఎస్‌కె అబ్దుల్‌కలాం వెరిఫికేషన్ చేసి సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు దర్శి ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సుమన్ తెలిపారు. మూడు రోజులుగా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి నిర్ధారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం నుండి సాయంత్రం 7గంటల వరకు 51 మందిని పరిశీలించి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలిపారు. మొత్తం ఈ నెలలో 700పైగా నియోజకవర్గంలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసి యూస్ చేసినట్లు తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. వికలాంగుల సర్టిఫికెట్లు లేకపోతే ప్రభుత్వం పెన్షన్ తీసివేస్తుందని, ఈనెల లోపు తప్పకుండా కావాలని వికలాంగులు తెలిపారు. సాయంత్రం 7గంటలైనా కూడా ఇంకా 15 మంది వరకు లైన్‌లో ఉన్నారని తెలిపారు. రాత్రి ఏ సమయమైనా పూర్తి చేస్తామని తెలిపారు.




అబాకస్ పోటీలలో గెలుపొందిన కుశాంక్ రెడ్డి

## అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థి

**ప్రజాశక్తి-తాళ్ళూరు**

మండలంలోని తూర్పుగంగవరం గంగా హైస్కూల్లో చదివే విద్యార్థి పాలం కుశాంక్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో అబాకస్ పోటీలో విజయం సాధించి బహుమతిని అందుకున్నారు. ఈనెల 9న విజయవాడలో జరిగిన అబాకస్ కాంపిటేషన్‌లో పాల్గొనగా ఈ విద్యార్థి విజయం సాధించారు. ఈ సందర్భంగా గంగా హైస్కూల్ కరస్పాండెంట్ అండ్ సెక్రెటరీ రావులపల్లి లక్ష్మీనారాయణ, డైరెక్టర్ చిన్నపరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.



ఓటు హక్కును వినియోగించుకున్న లక్ష్మి, లలిత సాగర్

## ఓటు హక్కు వినియోగించుకున్న గొట్టిపాటి లక్ష్మి దంపతులు

**ప్రజాశక్తి-దర్శి**

నరసరావుపేటలో మున్సిపల్ హైస్కూల్‌లోని బూత్ నెంబర్ 373లో తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ గురువారం ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తుకు మీ ఓటు ఊత్తమిస్తుందని, ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె కోరారు. విద్యావంతులైన పట్టబద్ధుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు విలువ తెలుసుకొని ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరారు.

## అద్దంకి టు శ్రీశైలం ఎక్స్‌ప్రెస్ బస్సు పునరుద్ధరణ

**ప్రజాశక్తి-తాళ్ళూరు**

జనవరి 2 నుండి ఆపివేసిన అద్దంకి టు శ్రీశైలం వయా తాళ్లూరు, తూర్పు గంగవరం, నాగంబొట్లవారి పాలెం, బొద్దికూరపాడు, కొత్తపల్లి, రాజంపల్లి మీదుగా తిరుగుచున్న ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావు దృష్టికి ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. విజయవాడలోని ఎస్ శ్రీనివాసరెడ్డి తీసుకుని వెళ్ళగా స్పందించి తిరిగి బస్సును శివరాత్రి నుండి పునరుద్ధరణ చేశారు. పునరుద్ధరణ చేయించుటకు కృషి చేసిన ఎండి ద్వారక తిరుమలరావు, ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, అద్దంకి డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌లకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, భక్తులు ధన్యవాదాలు తెలిపారు. బస్సు పునరుద్ధరణ వల్ల తమకెంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అద్దంకి నుండి శ్రీశైలం బస్సు వల్ల దర్శి పరిసర గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యమని తెలిపారు.

# పొలాల్లో రోడ్డు నిర్మిస్తే ఊరుకోం..

## కొప్పెరపాడు దళితులు

**ప్రజాశక్తి- పంగులూరు**

తమ పొలాల్లో రోడ్డు నిర్మిస్తే ఊరుకోమని తూర్పు కొప్పెరపాడు దళితులు తెలిపారు. ఎవరి స్వలాభం కోసం తమ పొలాలను పోగొట్టుకోలేమని తెలిపారు. తూర్పు కొప్పెరపాడులో దళితుల భూములకు శనివారం కొలతలు నిర్వహిస్తామని హాజరు కావాలని కోరుతూ తహశీల్దారు సింగారావు నోటీసులు పంపారు. సిపిఎం సీనియర్ నాయకులు రాయిని వినోద్ బాబుతో కలిసి దళితులు తహశీల్దారు కార్యాలయానికి వచ్చి తహశీల్దారును కలిశారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న దళితులకు సర్వేనెంబర్ 254 లో 20 మందికి ఒక్కొక్కరికి సుమారు 30 నుంచి 40 సెంట్లు మేర బంజర భూమిని ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిపారు. గతేడాది పంగులూరు గ్రామానికి చెందిన బాచిన రత్నకుమార్ అనే వ్యక్తి దళితులకు సంబంధించిన ఏడు ఎకరాల 50 సెంట్లు భూమిలో తన పొలానికి రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణాన్ని



దళితులతో మాట్లాడుతున్న తహశీల్దారు సింగారావు

తాము ప్రతిఘటించి రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులను కలిసినట్లు చెప్పారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి, ఆ భూమికి రత్నకుమార్‌కు ఎలాంటి సంబంధం లేదని, అందులో రోడ్డు వేయటం సరైనది కాదని తెలిపారన్నారు. దీంతో ఆ రోడ్డును అతని ద్వారానే పూడ్చి వేయించారన్నారు. ఏడాది తర్వాత మళ్లీ ఇప్పుడు ఆ భూమిలో రోడ్డు వేయాలని రవికుమార్ అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నట్లు తెలిపారు. దీంతో తహశీల్దారు తమకు నోటీసులు పంపారన్నారు. తమ అనుమతి లేకుండా, తమ భూమిలో రోడ్డు వేసే హక్కు ఎవరికీ లేదని తెలిపారు. ఈసారి రోడ్డు వేస్తే పరిస్థితులు వేరుగా ఉంటాయని తెలిపారు. చట్టపరంగా ఎదుర్కోవటానికి తాము సిద్ధంగా ఉన్నామని దళితులు తెలిపారు. ఆ భూమి వివరాలను విఆర్ఒ నూతలపాటి సుధాకర్, గ్రామ సర్వేయర్ నాయపాము ఎలీషా తహశీల్దారుకు వివరించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సింగారావు మాట్లాడుతూ, శనివారం ఆ భూమిని పరిశీలిస్తామని తెలిపారు. దళితులకు అన్యాయం జరగనివ్వనని హామీ ఇచ్చారు. తహశీల్దారును కలిసిన సిపిఎం సీనియర్ నాయకులు రాయని వినోద్ బాబు, వేమూరి సునంద బాబు, పాలపర్తి రాంబాబు, పాలపర్తి అబ్రహం తదితరులు ఉన్నారు.

# చక్కటి రాతతో మంచి మార్కులు

## కాలిగ్రాఫి ట్రైనర్ శారద

**ప్రజాశక్తి -యద్దనపూడి**

మంచి మార్కులు సాధించాలంటే మంచి చేతి రాతతోనే సాధ్యమని కాలిగ్రాఫి ట్రైనర్ మరియు ప్రధానోపాధ్యాయురాలు ఎంవిఆర్ఎల్ పి. శారద తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులుకు ఆమె సలహాలుసూచనలు చేశారు.ప్రస్తుతం పాఠశాలలు, కాలేజీలలో చదువుతున్న విద్యార్థులుతమ చేతిరాతపై శ్రద్ధ చూపటం లేదని తెలిపారు. దాని ఫలితంగా మంచి మార్కులు సాధించలేక పోతున్నారన్నారు. పరీక్షల మూల్యాం కణంలో ఉపాధ్యాయుల దష్టి విద్యార్థులు మంచి చేతి రాతపై ఉంటుందన్నారు. ఒకే విషయాన్ని ఇద్దరు విద్యార్థులు స్పష్టంగా రాసినప్పటికి ఎవరి చేతి రాత అందంగా క్లియర్‌గా అర్థం అవుతుంతో వారికి 10 శాతం అదనంగా మార్కులు ఇస్తున్నట్లు పలు సర్వేలు చెబుతున్నా యన్నారు. పరీక్షల్లో జవాబులు ఎలా రాయాలో తెలుసుకొని రాయడం వల్ల ఎక్కువ మార్కులు సాధించ వచ్చునని తెలిపారు.



**మంచి మార్కులు సాధించటానికి సూచనలు**

పూర్తి నమ్మకంతో రాయాలి, తక్కువ రాస్తూ ఎక్కువ మార్కులు సాధించే విధంగా అందంగా రాయాలి. పేపరు నాలువైపులా మార్జిన్స్ ఇస్తూ సైడ్ హెడింగ్స్‌తో పేజీకి 20 లైన్లు మించకుండా పదాలకు, పదాలకు మధ్య ఫింగర్ గ్యాప్ స్పేస్ ఇస్తూ తెలుగు అక్షరాలు అయితే గుండ్రంగా ను ఇంగ్లీష్ అక్షరాలు అయితే కొద్దిగా వాలుతో రాయాలి. సెక్షన్ నంబర్, ప్రశ్న నంబర్ క్లియర్‌గా రాయాలి. కీ పాయింట్స్ హైలైట్స్ చేయాలి. పేపరు సూపరులను ఆకట్టు కొనేవిధంగా ప్రజెంట్ చేయాలి. ప్రశ్నలకు, రిలేటెడ్‌గా జవాబులు ఉండేటట్లుగా రాయాలి. సమయ విభజన ప్రశ్నల వారిగా చేసుకొని పరీక్ష ముగించాలి. 10 మార్కుల ప్రశ్నను 10 నుంచి 12 నిముషాలలోపు రాయాలి. మార్కులు ప్రశ్నను 8 నుంచి 10 నిముషాలలోపు రాయాలి. ఒక్క మార్కు ప్రశ్నను 1 లేదా 2 నిముషాలులో రాయాలి. ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలకు మాత్రమే జవాబులు రాయాలి. పరీక్షలు స్పీడ్‌గా అందంగా రాయడంప్రాక్టీస్ చేయాలి



మాట్లాడుతుర్న డాక్టర్ సాధిక్

## టిబి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**ప్రజాశక్తి- అద్దంకి**

గ్రామాలను టిబి రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలని జిల్లా ఎయిడ్స్, క్షయ,కుష్టు నివారణ అధికారి డాక్టర్ సాధిక్ తెలిపారు. అద్దంకి మండలం మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోపాలపురం,పేరాయపాలెం, ఉప్పలపాడు గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 2024లో గోపాలపురం, పేరాయపాలెం, ఉప్పలపాడు గ్రామాల్లో టిబి కేసులు జీరోగా నమోదు అయినట్లు తెలిపారు. ఆయా గ్రామాలు టిబి రహిత గ్రామాలుగా ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ హర్ష, ఎస్‌టిసిఎస్‌లు రాజశేఖర్, వెంకటరత్నం, సూపర్ వైజర్ శ్రీనివాసరావు, నోడల్ అధికారి ఎస్‌కె.అబ్దుల్ సత్తార్, ఎంపి హెచ్ఇఒ నాగేశ్వర రావు,ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

## మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

**ప్రజాశక్తి- అద్దంకి**

అద్దంకి పట్టణంలో హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా మున్సిపల్ అనుమతులు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు. కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పట్టణంలో చేపట్టిన అభివద్ధి పనులకు కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం పొందుపరిచిన 46 అభివద్ధి అంశాలను సీనియర్ అసిస్టెంట్ అర్జునరావు చదివి వినిపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో అనధికారకంగా ఎవరికి తోచిన విధంగా వారు ప్రచార బోర్డులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పై ప్రజలు, వ్యాపారవర్గాల నుంచి అభియోగాలు వస్తున్నాయన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు ప్రధాన కూడళ్లు, రహదారులు,డివైడర్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగ కూడదనే ఉద్దేశంతో హోర్డింగులు నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలనుకుంటే మున్సిపల్ అనుమతులు పొందాలన్నారు.అనుమతులు పొంది ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు 2 రోజులు కంటే ఎక్కువ కాలం ఉంచరాదని తెలిపారు. మున్సిపల్ అనుమతులు పొంది ఉన్న ప్రైవేట్ వ్యక్తుల హోర్డింగ్ బోర్డులపై కూడా వారి అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తులపై,ఫ్లెక్సీ ప్రింటింగ్ చేసిన సంస్థ బాధ్యులుపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వేసవి దష్ట్యా పట్టణంలో మినరల్ వాటర్ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌన్సిల్ ముందు ఉంచిన 46 అభివృద్ధి అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి, ఎఇ, టిపిఒ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరాం రెడ్డి, వైస్ చైర్మన్ దేసు పద్మేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

## 'కళావాణి' వ్యవస్థాపక సభ్యులు కెఆర్‌కె. ప్రసాద్ మృతి

**ప్రజాశక్తి-పర్చూరు**

మండల పరిధిలోని నాగులపాలెం గ్రామానికి చెందిన కళావాణి వ్యవస్థాపక సభ్యులు కెఆర్‌కె. ప్రసాద్ (73) గురువారం మృతి చెందాడు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నాగులపాలెం కళావాణి వ్యవస్థాపక సభ్యులుగా కొనసాగారు. సాంఘిక నాటకాలలో అనేక పాత్రలు పోషించారు. గ్రామాలలో సాంఘిక నాటకాలు ప్రదర్శించి మంచి నటుడుగా గుర్తింపు పొందారు. ఈయన రాముడు రంగడు, పల్లెపడుతూ, కథానాయకుడు నాటకాలలో హీరో పాత్ర ద్వారా మంచి గుర్తింపు పొందారు. ప్రసాద్ మృతి పట్ల కళావాణి కార్యవర్గ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.



కెఆర్‌కె. ప్రసాద్(ఫైల్)




అద్దంకిలో పంటలను పరిశీలిస్తున్న ఎఒ

## గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి-అద్దంకి**

గింజ నాణ్యత కోసం పంట చివరి దశలో పొటాష్ వేయాలని ఎఒ కొర్రపాటి వెంకటకష్ణ తెలిపారు. మండల పరిధిలోని మైలవరం,ఉప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ వరి, మొక్కజొన్నకు పంట చివరి దశలో ఎకరానికి 25 కేజీల వంతున పొటాష్ వేయాలన్నారు. దీని వల్ల గింజ నాణ్యతగా వస్తుందన్నారు. బరువు కూడా పెరుగుతుందన్నారు. ఫలితంగా రైతులకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ క్రాప్ నమోదుకు మార్చి 3 వరకూ గడువు ఉన్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు రఫీ, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కారంచేడు :** పంట మార్పిడి విధానంతో రైతులు అధిక దిగు బడులు సాధించవచ్చునని ఎఒ కె.సుధీర్ బాబు తెలిపారు. మండలపరిధిలోని కేశవరప్పాడు, రంగప్పానాయుడు వారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ శనగ పంటలో వచ్చే ఎండు తెగుళ్ల, వేరుకుళ్ళ తెగులు నివారణకు రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి విధానం అమలు చేయాలన్నారు. వేరుశనగ పంటకు బదులు మొక్కజొన్న, సజ్జ సాగు చేసుకోవాలన్నారు. విత్తనాలు విత్తే సంయంలో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బిందు,మాధురి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**ఇంకొల్లు :** శనగ పంట కోసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ వేణుగోపాల్ తెలిపారు. మండల పరిధిలోని నక్కలపాలెం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ వేణుగోపాల్ మాట్లాడుతూ శనగలు కోసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి రైతులకు వివరించారు. భూసారం పెంపు కోసం పచ్చి రొట్ట ఎరువులు జీలుగ, జనుము, పిల్లిపిసర సాగు చేసి భూమిలో కలియ దున్నాలన్నారు. దీంతో పంటల దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువర్ధక శాఖ, వ్యవసాయ సయకులు , రైతులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అనిల్‌కుమార్, గంగయ్య

# ఓటమి భయంతోనే దాడులు

- బాపట్లలో లక్ష్మణరావు మద్దతుదారుడిపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాశక్తి-బాపట్ల**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కెఎస్ లక్ష్మణరావు మద్దతుదారులపై టిడిపి నాయకులు దాడికి తెగబడ్డారని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. గురువారం గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బాపట్ల పట్టణంలో మున్సిపల్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రం వద్ద దొంగ ఓట్లను అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు పిడిఎఫ్ కార్యకర్త ఎస్.అనిల్ కుమార్ పై పట్టణ టిడిపి అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు దాడికి తెగబడ్డాడు. పట్టణ పోలీసుల సమక్షంలోనే ఈ దాడి జరిగిందని సిపిఎం నాయకులు గంగయ్య విమర్శించారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో గొలపల శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా కె.ఎస్ లక్ష్మణ్ రావు మద్దతుదారుడైన ఎస్ అనిల్ కుమార్‌పై పదేపదే దాడులకు ప్రయత్నం జరిగిందన్నారు. ఎన్నికల సమయం ముగిసే కొద్ది సేపటికి దొంగ ఓట్లు వేయించేందుకు గొలపల శ్రీనివాసరావు ప్రయత్నించారన్నారు. ఇదేమిటి అని ప్రశ్నించడంతో అనిల్ కుమార్ పై దాడి చేశాడన్నారు. అధికార మదంతో ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే పద్ధతుల్లో టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. పెద్దల సభకు జరిగే ఎన్నికల్లో సైతం సాధారణ ఎన్నికల్లాగ దౌర్జన్యాలకు, డబ్బులు పంపిణీకి పూనుకొని ఎట్టైనా గెలవాలనే ఈ దాడులకు పూనుకున్నారన్నారు. ఈ సంఘటన మేధావులు సహించే పరిస్థితి కాదన్నారు. ఎప్పటికైనా తెలుగుదేశం పార్టీ పునరాలోచించకపోతే తెలుగుదేశం పార్టీకి గతంలో ఏం జరిగిందో తిరిగి అదే పునరావృతం అవుతుందని హెచ్చరించారు. 'శ్రీనివాసరావు ఏదో అనుకుంటున్నాడేమో అతని సంగతి చూస్తాం ..పద్ధతిగా ఉంటే పద్ధతిగా ఉంటుంది .అధికారం ఉంది కదా అని విర్రవీగితే అతని ఆటలు సాగనివ్వం' అని గంగయ్య హెచ్చరించారు. శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, వసంతరావు, కొండయ్య, నాగేశ్వరరావు, అనిల్ కుమార్, పార్టీ నాయకులు ఉన్నారు.

### రైతాంగంపై

# ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టాలి

- డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి
- 5న జిల్లా కేంద్రాలలో ధర్నా
- 10న గుంటూరులో రాష్ట్రస్థాయి ఆందోళన
- జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల పిలుపు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

రైతాంగ ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రపూరిత దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ మార్చి 5న జిల్లా కేంద్రాలలో, మార్చి 10న గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆందోళనలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవన్లో సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం నాడు సమావేశం నిర్వహించారు. సమావేశానికి అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ జాతీయస్థాయిలో సంయుక్త కిసాన్ మోర్చా ఐక్యతను దెబ్బతీయటమే లక్ష్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగా అనేక కథనాలను ప్రచారం చేస్తూ గిట్టుబాటు ధరలపై ఒప్పందం కుదురుతున్నట్లు కుట్రపూరితమైన ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ దుష్ప్రచారాన్ని రైతాంగమంతా ఐక్యతతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులు మేరకు సీ 2 ప్లస్ 50 పర్సంట్ (సమగ్ర పంటల ఉత్పత్తి ఖర్చుకి 50 శాతం అదనంగా కలిపి) మద్దతు ధరను చట్టబద్ధత చేసేంతవరకు పోరాటం ఆగదని పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కె.హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైట్‌బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకు దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందన్నారు. పెట్టుబడులు మాత్రం విపరీతంగా పెరిగాయన్నారు. వ్యాపారులు క్వింటాకు గత ఏడాది కన్నా రూ.4 వేల నుండి 5 వేలు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ధరల స్థిరీకరణ నిధిని రూ.3 వేల కోట్ల నుండి 4 వేల కోట్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ నీటిని చంద్రబాబునాయుడు సరుకుగా చేస్తూ వ్యవసాయానికి నీటిని అమ్మేందుకు చూడటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రాష్ట్రంలో మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. క్వింటాకు రూ.20 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి మాట్లాడుతూ జామాయిల్, సుబాబుల్ కర్రను పెరిగిన ధరలకు అనుగుణంగా కాకుండా, ఐటిసి కూటమి మాటున క్వింటాకు రూ.1000 నుండి 1500 వరకు వ్యాపారులు తగ్గించి కొనుగోలు చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. తగ్గిన జామాయిల్ సుబాబుల్ కర్ర ధరలకు నిరసనగా మార్చి 3న ఖమ్మం జిల్లాలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అందుకు అనుకూలంగా ప్రకాశం, కష్ణ, గుంటూరు జిల్లాలలో కూడా కర్ర రైతులు ఆందోళనలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రకాశం జిల్లాలో సాగు చేసిన తేజ రకం మిర్చి ధర క్వింటాకు రూ.13 వేల నుండి 14 వేల వరకు గుంటూరు మిర్చి యార్డులో ధర పలుకుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మిర్చికి రూ.11,781 మద్దతు ధర ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ఏఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్.సాయి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు బిగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విప్లవ రైతుసంఘం జిల్లా కన్వీనర్ భీమవరపు సుబ్బారావు మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఒంగోలు డెయిరీని ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. అమూల్ నుండి ఒంగోలు డెయిరీ ఆస్తులను సంరక్షించాలన్నారు. పాలకు ప్రోత్సాహం కింద లీటరుకు రూ.6 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతిబాబు మాట్లాడుతూ కంది, శనగ, మినుము వంటి అపరాల పంటలు దిగుబడులు గణనీయంగా తగ్గాయన్నారు. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి సరుకులు దిగుమతి చేసుకునేందుకు వచ్చే ఏడాదికి కూడా ఒప్పందం చేసుకోవడం దేశీయ రైతాంగాన్ని నిలువునా ముంచేందుకేనన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు సిహెచ్.సాగర్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 74.30 శాతం పోలింగ్

**ప్రజాశక్తి - బాపట్ల జిల్లా, రేపల్లె**

**బాపట్ల జిల్లాలోని 12 మండలాల పరిధిలో పట్టభద్ర ఓటర్లు 24,493 మంది ఉండగా వీరిలో 18,198 ఓటు హక్కును వినియోగించుకున్నారు. 11,736 మంది పురుషులు, 6,462 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవడంతో జిల్లాలో 74.30 శాతం పోలింగ్ నమోదయింది.**

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి జె.వెంకటమురళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమైందన్నారు. ఉదయం 10 గంటలకు 9.77 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 29.29 శాతంగా నమోదయిందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు 51.60శాతం, సాయంత్రం 4 గంటలకు 74.31 శాతంగా పోలింగ్ జరిగిందని తెలియజేశారు. చుండూరు మండలం లో ఉదయం 10 గంటలకు 9.5 శాతం మధ్యాహ్నం 12 గంటలకు 28.37 శాతం మధ్యాహ్నం 2 గంటలకు 50.55 శాతం, సాయంత్రం 4 గంటలకు 72.87 శాతంగా నమోదయిందన్నారు. అమృతలూరు మండలంలో ఉదయం 10 గంటలకు 9.91 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 19.95 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 49.44 శాతం, సాయంత్రం 4 గంటలకు 79.92 శాతం నమోదు అయిందన్నారు. వేమూరు మండలంలో ఉదయం10 గంటలకు 12.10 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 17.20 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 55.55 శాతం, సాయంత్రం 4 గంటలకు 73.78 శాతంగా నమోదు అయిందన్నారు. కొల్లూరు మండలంలో ఉదయం 10 గంటలకు 8.5 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 17.16 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 40.07 శాతంగా, సాయంత్రం 4 గంటలకు 72.45 శాతంగా నమోదు అయిందన్నారు. భట్టిప్రోలు మండలం లో ఉదయం 10 గంటలకు 9.8శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 18.5 శాతం , మధ్యాహ్నం 2 గంటలకు 47.28 శాతం, సాయంత్రం 4 గంటలకు 75.45 శాతంగా నమోదు అయిందన్నారు. చెరుకుపల్లి మండలం లో ఉదయం 10 గంటలకు 10.30 శాతంగా మధ్యాహ్నం 12 గంటలకు 21.0 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 54.09 శాతం, సాయంత్రం 4 గంటలకు 75.47 శాతంగా నమోదు అయిందన్నారు. నగరం మండలంలో ఉదయం 10 గంటలకు 8.58 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 17.80 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 45.58,శాతం, సాయంత్రం 4 గంటలకు,71.63 శాతంగా నమోదు అయిందన్నారు. రేపల్లె మండలంలో ఉదయం 10 గంటల కు 10.75 శాతంగా మధ్యాహ్నం 12 గంటలకు 18.94 శాతంగా, మధ్యాహ్నం 2 గంటలకు 50.17 శాతం, సాయంత్రం 4 గంటలకు 76.25 శాతం నమోదు అయిందన్నారు. నిజాంపట్నం మండలంలో ఉదయం 10 గంటలకు 8.82 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 16.33 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 43.96 శాతం, సాయంత్రం 4 గంటలకు 78.19 శాతంగా నమోదు అయిందన్నారు. పిట్టవానిపాలెం మండలంలో ఉదయం 10 గంటలకు 11.17 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 20.10 శాతం, మధ్యాహ్నం రెండు గంటలకు 52.03 శాతం, సాయంత్రం 4 గంటలకు 72.29 శాతం నమోదు అయిందన్నారు. కర్లపాలెం మండలంలో ఉదయం 10 గంటల కు 9.5శాతంగా మధ్యాహ్నం 12 గంటలకు 23.17 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 55శాతం గా, సాయంత్రం 4 గంటలకు 77.50 శాతంగా నమోదు అయిందన్నారు.



రేపల్లెలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి



పోలింగ్ కేంద్రాల వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ తూషార్‌డూడీ